విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 11 జనవరి 2025 8 పేజీలు

ఏలూరు

తాడేపల్లిగూడెం

రాజమండ్రి

పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలివ్వాలి

- తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఐ ధర్నా
- వినతిపత్రాలు అందజేత

విశాలాంధ్ర-ఏలూరు/తాడేపల్లిగూడెం/రాజమండ్రి: పేదవాని సొంతింటి కల సాకారం కోసం కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు ఇంటి స్థలాలను పెంచి తక్షణమే అందజేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాజమండ్రి, రాజోలులో తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో ఏలూరు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం 35 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తున్నామని చెప్పి సెంటు స్థలంలో చాలీచాలని ఇంటి స్థలాన్ని కేటాయించిందని విమర్శించారు. ఆనాటి నుండి పేదవాడికి పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ అనేక ఉద్యమాలను, పోరాటాలను నిర్వహించిందని గుర్తు చేశారు. ఈ ఉద్యమాలను, పోరాటాలను గమనించిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని వాగ్దానమిచ్చి, నేటికీ ఆ వాగ్దానాన్ని అమలు చేయకుండా లోటు బడ్జెట్ అంటూ తాత్సారం చేయడం తగదన్నారు. తక్షణమే పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1లక్షా 80 వేలు, డ్వాక్రా గ్రూపు ద్వారా మరో రూ.35 వేలను మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలలో కేవలం 12 శాతం మాత్రమే నిర్మాణ దశలో ఉన్నాయని, మిగిలిన వారు ఎవరు నిర్మాణం చేసుకోలేని పేద ప్రజలని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలు సొంతింటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరచడం ద్వారా పేదవారికి సొంత ఇంటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయించడం కోసం 2024 నవంబర్ ఒకటవ తేదీ నుండి ▶మిగతా 2లో..

పల్లె పండుగలో పవన్

విశాలాంధ్ర బ్యూరో - కాకినాడ : ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధ్యయనం చేస్తూ..ప్రభుత్వ శాఖల సమన్వయంతో వివిధ వర్గాల ప్రజలకు అందుతున్న సేవలపై పరిశీలన చేస్తూ..అధికారులను అడిగి సందేహాలు నివృత్తి చేసుకుంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గ కేంద్రంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో పాలుపంచుకున్నారు. హరిదాసు కీర్తనలు ఆస్వాదించారు. పిట్టల దొరల కోతలు, జంగమదేవరల జోస్యాన్ని ఆసక్తిగా ఆలకించారు. సంక్రాంతి పండుగ వేళ హరిదాసుకు బియ్యం వేసి మన సంస్కృతి, సంప్రదా యాలపై తనకున్న మక్కువను చాటుకున్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా వ్యవసాయశాఖ, పశుసంవర్థకశాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, మత్స్య, జౌళి, గ్రంథాలయ, ఉద్యానవన, మహిళాశిశు సంక్షేమ శాఖల ఆధ్వ ర్యంలో ప్రజలకు అందిస్తున్న సేవలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు.

దారిపొడవునా ఘన స్వాగతం : అంతకు ముందు పిఠాపురం పర్యటన నిమిత్తం రాజమండ్రి విమానాశ్రయం నుంచి ఏడీబీ రోడ్డు మీదుగా పవన్ కళ్యాణ్ పర్యటించారు. రాజానగరం, పెద్దాపురం, సామర్లకోట, రంగంపేట దారి పొడవునా గ్రామగ్రామాన ప్రజలు ఉపముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. రహదారికి ఇరువైపులా హారతులు పట్టారు. పూల వర్షం కురిపించారు.

మత్స్యకార సహకార సంఘాన్ని ఏర్పాటు చేయండి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: ముసునూరు గ్రామంలో మత్స్యకార సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం వద్ద ముసునూరు గ్రామ మత్స్యకారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జమలయ్య, కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఏలూరు జిల్లా ముసునూరు గ్రామంలోని దేవర చెరువు, నల్లచెరువు 250 ఎకరాలలో విస్తరించి ఉన్నాయని తెలిపారు. రెండు చెరువులు నూజివీడు సొసైటీ పరిధిలో ఉన్నాయన్నారు. ఈ చెరువులు చేపల పెంపకానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. గ్రామంలో కొంతమంది మత్స్యకారులు చేపలు పట్టుకొని ఉపాధి పొందుతున్నారన్నారు. వీరు ఏ సొసైటీలలో సభ్యులుగా లేరన్నారు. ఉపాధి కరువై ఇబ్బంది పడుతున్న స్థానిక మత్స్యకారుల కోరిక మేర ఆ చెరువులను నూజివీడు సొసైటీ నుండి బదిలీ చేసి ముసునూరు గ్రామంలో మత్స్యకార సంఘాన్ని ఏర్పాటు చేసి, ఆ సంఘంలో భాగస్వాములను చేసి ఉపాధి కల్పించాలని తెలిపారు. అనంతరం మత్స్యశాఖ సహాయ సంచాలకులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, మధు, చంగల వెంకటేశ్వరరావు, కొక్కిరపాటి ఆనంద్, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

ఏలూరు రైల్వే స్టేషన్‌కు కొత్త శోభ

శరవేగంగా ఆధునీకరణ పనులు

విశాలాంధ్ర - ఏలూరు: ఏలూరు రైల్వేస్టేషన్ కొత్త హంగులను సంతరించుకుంటోంది. నాలుగు నెలల క్రితం ప్రారంభమైన ఏలూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఏలూరు రైల్వే స్టేషన్, పవర్ పేట రైల్వే స్టేషన్‌లలో చేపట్టిన ఆధునీకరణ పనుల కారణంగా ఆయా స్టేషన్ల రూపురేఖలు మారిపోతున్నాయి. కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ. 21.10కోట్ల నిధులు ఏలూరు రైల్వే స్టేషన్‌కు కేటాయించారు. ఈ నిధులతో చేపట్టిన పనులు దాదాపు 75శాతం పూర్తి అయినట్లు రైల్వేస్టేషన్ అధికారులు చెబుతున్నారు. రైల్వే ప్లాట్‌ఫారంల ఎత్తు పెంచడం, ప్రయాణికులు వేచి ఉండే భవనం, మూత్రశాలలు, మరుగుదొడ్లు, డ్రింకింగ్ వాటర్, ప్లాట్‌ఫారాలపై రేకుల షెడ్ల పునర్నిర్మాణం తదితర పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఇక స్టేషన్ ఎదుట సుందరీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ పనులు కూడా పూర్తయితే ఏలూరు రైల్వే స్టేషన్,పవర్‌పేట రైల్వేస్టేషన్లు అత్యంత ఆకర్షణీయంగా మారతాయనడంలో సందేహం లేదు.

ఘనంగా కరాటం జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్, సీనియర్ రాజకీయ నాయకులు కరాటం రాంబాబు జన్మదిన వేడుకలను మండల కేంద్ర మైన కొయ్యల గూడెం పట్టణంలో ముప్పిడి

చిన్నబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డి గూడెం రోడ్డులో ఉన్న రోటరీ కల్ప వృక్షం వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధుల మధ్య కేక్ కటింగ్ నిర్వహించి, వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన పోలవరం నియోజకవర్గంలో కరాటం రాంబాబు సీనియర్ రాజకీయ నాయకులని, ఆయన సహాయ సహకారాలతో పలు గ్రామాలు పట్టణాలుగా మారాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాల దేవి, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, చెప్పుల మధుబాబు, నక్క బావి, మేడిద కన్నయ్య, ఏపూరి సతీష్, కొడపాక పాండు, దారం సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

తొక్కిసలాటను రాజకీయం చేస్తారా?

తేదేపా ఎస్.సి. రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ

విశాలాంధ్ర -ఏలూరు: తిరుపతి తొక్కిసలాటను రాజకీయం చేసి వైకాపా వాళ్ళు లబ్ధి పొందాలని చూస్తున్నారని తెదేపా ఎస్.సి. సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. దీని కంటే సిగ్గుమాలిన చర్య మరొకటి ఉంటుందా?అని మాజీ ముఖ్య మంత్రి జగన్ పై ఆయన మండిపడ్డారు.ఈ ఘటన వెనక కుట్రకోణం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. 'విశాఖకు వచ్చిన ప్రధాని మోదీ..రాష్ట్రంలో రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు చేశారన్నారు.ఆ అంశంపై నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కొన్ని దుష్టశక్తులు తిరుపతిలో కుట్ర చేసినట్లు అనుమానం ఉందన్నారు. వైసిపి సోషల్ మీడియా, జగన్ ఆరోపణలు టీటీడీ ప్రతిష్టకు భంగం వాటిల్లేలా ఉన్నాయని ఖండించారు.

కోడిపందాల నిరోధానికి అవగాహన

విశాలాంధ్ర-లింగపాలెం: సంక్రాంతి పేరుతో కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ నజీమ్ హెచ్చరిం చారు. వీటి నిరోధానికి అవగాహన కల్పిస్తూ కలరాయనగూడెం, అయ్యపరాజు గూడెంలో ర్యాలీలు నిర్వహించి సమావేశాలు ఏర్పాటు చేశారు. లింగపాలెం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ కోడిపందాలు నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ రెవిన్యూ అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాలలో ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-లింగపాలెం : ధర్మాజీగూడెం హోలీట్రినిటీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంబరాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం పాల్గొని సందడి చేశారు. భోగి మంటలు వేశారు. పిండి వంటలు తయారు చేశారు. గొబ్బెమ్మలు, ముగ్గులతో కనువిందు చేశారు. నృత్యాలు, డాన్సులు, పాటలతో అలరించారు.

కోడిపందేలు, జూదం, గుండాటలపై ఉక్కుపాదం

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు: జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు నిర్వహించాలంటే భయపడేలా అధికారుల చర్యలు ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా, మండలస్థాయి అధికారులు, పోలీసు, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా ఎస్.పి. కె.పి.ఎస్ కిషోర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ కోడిపందేలు, జూదం, గుండాట, మద్యం అక్రమ రవాణాపై నిరంతర గట్టి నిఘా ఉంచాలన్నారు. కోడిపందేలు ఆడటం, నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లాలోని డిఎస్పీలు, ఎస్‌హెచ్ఓలతో సమన్వయంతో పర్యవేక్షించడా నికి సబ్ కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు వారి సంబంధిత కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోడిపందేలు, జూద క్రీడల వంటి వాటిజోలికి ముఖ్యంగా యువత వెళ్లకుండా గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో సాంప్రదాయ క్రీడలు, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్.పి. కె. ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నేపధ్యంలో జిల్లాలో ఎక్కడైనా

కోడిపందేలు, పేకాటలు నిర్వహించినా, బెట్టింగులకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో ఇదే తరహాలో నేరాలకు పాల్పడి అరెస్టయిన వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు పిలిచి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అయిన తహశీల్దార్ వద్ద ముందస్తుగా బైండోవర్ చేయాలని సూచించారు. కోడిపందేలు, జూద క్రీడలకు ఆశ్రయం ఇచ్చే స్థల యజమానులను బాధ్యులను చేస్తూ వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ఎస్ బి సిఐ మల్లేశ్వర రావు తదితరులు పాల్గొనగా ఆయా రెవిన్యూ డివిజన్ల నుంచి నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్,ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డిఓలు అచ్యుత అంబరీష్, ఎం.వి.రమణ, పలువురు డిఎస్పీలు, తహశీల్దార్లు,ఎస్ హెచ్ఓలు తదితరులు హాజరయ్యారు.

సామాన్యులకు వరం పిఎం సూర్యఘర్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి పొందడానికి చక్కని పరిష్కారం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో ఇప్పుడు సోలార్ రూఫ్‌టాప్ పథకం సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ రోజు రోజుకూ పెరిగిపోతున్న విద్యుత్తు బిల్లుల సమస్యకు పరిష్కారం చూపించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక అద్భుతమైన పథకాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుని ఉచిత కరెంటు పొందవచ్చని, సుదీర్ఘకాలం ఉచిత విద్యుత్తు పొందడమే కాదు మిగులు విద్యుత్తును విక్రయించి ఆదాయమూ పొందవచ్చనేది ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లి యోజన పథకమన్నారు. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా 3 కిలోవాట్ల వరకు ఇన్‌స్టాల్ చేసుకోవచ్చని, ఒక్కో కిలోవాట్‌కు కేంద్రప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుందని, ఇంటిపై 3 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుంటే రూ.1.45 లక్షలు ఖర్చవుతుంది. దీనిపై కేంద్రం రూ.78 వేలు రాయితీ అందిస్తుంది.

మిగతా సొమ్మును ఎలాంటి గ్యారంటీ లేకుండానే బ్యాంకు ద్వారా రుణం తీసుకోవచ్చని కలెక్టర్ వివరిం చారు. నెలకు 0-150 యూనిట్ల వరకు కరెంట్ వాడుకునే వారికి కేవలం 100 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే 1-2 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవచ్చని 150-300 యూనిట్ల వరకు అయితే 2-3 కిలోవాట్ల ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. పీఎంసూర్యఘర్. గవ్.ఇన్ పోర్టల్లో రిజిస్టర్ చేసుకోవాలని సుదీర్ఘకాలం పాటు సూర్యఫలకాలు పనిచేస్తాయని, పెట్టిన పెట్టుబడి ఐదేళ్లకే తిరిగి వస్తుందని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సంక్రాంతి సంప్రదాయంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సంక్రాంతి పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలని తహసీల్దారు చెల్లన్న దొర తెలిపారు. మండలంలో గవరవరం, రాజవరం, గ్రామాలలో కోడి పందాలు నిర్వహించడానికి ఏర్పాటుచేసిన బరులను ఎస్సై చంద్రశేఖర్ తో కలిసి తహసీల్దార్ ధ్వంసం చేయించారు. మండలంలో ఎక్కడైనా కోడి పందాలు నిర్వహించడానికి బరులు ఏర్పాటు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్థలాలివ్వాలి (1వ పేజీ తరువాయి)

18వతేదీ వరకు ఇళ్ల స్థలాల లబ్ధిదారుల వద్ద నుండి అర్జీలు సేకరించి గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించామని, రెండవ దశలో మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్నా మని తెలిపారు. పేదల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహ రించాలని, వారికి ఇంటి స్థలాలను అందించడమే కాకుండా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండేటి బేబి, పుప్పాల కన్నబాబు, జిల్లా సమితి సభ్యులు మావూరి విజయ, నాగం అచ్యుత్, ఏరియా కౌన్సిల్ సభ్యులు కొల్లూరి సుధా రాణి,బాలపు కృష్ణ ప్రసాద్, ఉప్పులూరి లక్ష్మి, భవాని, గొర్లి స్వాతి, శయన అఖిలాష్ కుమార్, బి.శ్రీదేవి, పెచ్చెట్టి నూకరాజు, జి. నాగేశ్వరరావు, జి.బుజ్జి, ఆర్.రాజేష్, ఎస్.శ్రీను, కంతపు రెడ్డి ఈశ్వర్, పడాల రాము, తదితరులు పాల్గొన్నారు.

చౌకడిపో డీలర్ల పోస్టులు భర్తీకి నోటిఫికేషన్

విశాలాంధ్ర - లింగపాలెం: లింగపాలెం మండలంలోని 8 చౌక డిపోలకు డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తహసిల్దార్ నజీమ్ వెల్లడించారు. మండలంలోని ధర్మాజీగూడెం 4నెంబరు ఎస్సీ మహిళ, కొణిజర్ల 6నెంబరు బిసి(బి)టి. సి.హెచ్.ఆర్. పాలెం 8 నెంబరు జనరల్, మఠంగూడెం9 నెంబరు ఎస్సీ జనరల్, కలరాయన గూడెం12 నెంబరు జనరల్ మహిళ, బాదరాల 14 నెంబరు అర్థికంగా వెనుకబడిన జనరల్ కేటగిరికి, రంగాపురం 15 నెంబరు ఎస్సీ జనరల్‌కు, గణపవారి గూడెం 23 నెంబర్ ఎస్సీ జనరల్‌కు కేటాయించినట్లు తెలిపారు. చౌకు డిపోలకు దరఖాస్తు చేసుకునే వారు ఇంటర్ ఉత్తీర్ణత పొందా లని, వయో పరిమితి 19 ఏళ్ళు నిండి 40 ఏళ్ల పైబడి ఉండకూడదన్నారు. స్థానికంగా గ్రామాలలో నివసించే వారు మాత్రమే అర్హులని, దరఖాస్తుల గడువు ఈ నెల19 వరకు ఉందని దరఖాస్తులను పరిశీలించి రాత పరీక్షకు అర్హుల జాబితాను ఈనెల28న నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రకటిస్తారని,ఈనెల 31న హాల్ టికెట్లు ఇస్తారని ఫిబ్రవరి 8న రాత పరీక్ష ఉంటుందని తహ సిల్దార్ తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు నూజివీడు సబ్ కలెక్టర్కు దరఖాస్తుచేయాలని, రాత పరీక్ష నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాల యంలో జరుగుతుందని వెల్లడించారు.

గణతంత్ర వేడుకలకు రాహిని

విశాలాంధ్ర - పెంటపాడు : అజాది కి అమృత్ మహోత్సవం లో భాగంగా కేంద్ర ప్రభుతం చేపట్టిన వీర్ గాధ 4.0 కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని విద్యార్ధులందరికీ దేశం కోసం త్యాగం చేసిన వీరుల పట్ల అవగాహన కల్పించడం కోసం ఆన్లైన్లో వ్యాస రచన, పెయిం టింగ్, పద్య రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా నుంచి దాదాపుగా 98,000 ఎంట్రీలు నమోదు అవ్వగా అందులో పెంటపాడు మండలానికి చెందిన సరస్వతి విద్యాలయ పాఠశాల విద్యార్థి జవ్వాది రాహిని నేషనల్ టాప్ హండ్రెడ్ ఎంట్రీస్‌లో ఒకటిగా ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివి ఎన్ ఎస్ ఎస్ బి ఎల్ నారాయణ, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష శ్యామ్ సుందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు మండల విద్యాశాఖ అధికారులు ఎం. శ్రీనివాస్, టీవీ రామకృష్ణ పాల్గొన్నారు.

పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: గ్రామాల్లో ఎక్కడైనా కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని రెవిన్యూ, పోలీస్, అధికారులు మైకుల ద్వారా, ఫ్లెక్సీల ద్వారా ఊదరగొడుతున్న నేపథ్యంలో యనమదుర్రు పంచాయతీ సమీ పంలో కోడి పందాలు నిర్వ హించే దుకు ముందుగానే భూమి చదును చేసి ఏర్పాటు చేయడంతో, ఆ పంచాయతీ కార్యదర్శి,పెదపూడి వీర్రాజు, వీఆర్వో వివి నాగరాజు శుక్రవారం హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఈనెల 13 నుండి శ్రీమావుళ్ల అమ్మవారి 62వ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం డీఈవో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవో కే ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ ఆర్. రాంబాబు, అదనపు ఎస్.పి. భీమారావు ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. భీమవరం వన్ టౌన్ సీఐ నాగరాజు ఆలయ సహ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఏర్పాట్లు పరిశీలించిన వారిలో ఉన్నారు.

పేదల గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలు కేటాయించి,గృహ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరుతూ శు క్రవారం సీపీఐ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని, లబ్ధిదారుల వ్యక్తిగత దరఖాస్తులు డిప్యూటీ తహశీల్దార్ టి.డేవిడ్‌కు అందజేశారు. ధర్నా నుద్దేశించి భీమారావు మాట్లాడుతూ సొంత ఇళ్ళు లేని పేదలు అద్దె ఇళ్ళలో నరకయాతన అనుభవిస్తున్నారని, చాలీచాలని వేతనాలతో అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. సొంత గూడు లేని నిరుపేదలకు ముఖ్య మంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఇళ్ళ స్థలాలు కేటాయించాలన్నారు. గృహాల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని,పేదల సొంత ఇంటి కల నెరవేర్చాలని భీమారావు కోరారు. సీపీఐ తాడేపల్లి గూడెం పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లా డుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నింటినీ అమలు జరపాలన్నారు. ధర్నాకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, తాడేపల్లిగూడెం సీపీఐ మండల కార్యదర్శి యు.జయకృష్ణ, మాసా బాబూరావు, దాస్యం రాము, కోనాల జోసెఫ్, స్వర్ణకుమారి, శ్రీదేవీ,జ్యోతి తదితరులు నాయకత్వం వహించారు.

పెంటపాడు : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ, సీపీఐ పిలుపుమేరకు శుక్రవారం పెంటపాడు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మహిళలు పాల్గొని తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కే.లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అభాగ్యులైన నిరుపేదలను నిర్లక్ష్యం చేసిందని, మండలంలోని పెంటపాడు, ఆకుతీగపాడు, జట్లపాలెం,కస్పా పెంటపాడు, వల్లూరిపల్లి గ్రామాలలో ఇళ్ల స్థలాలు లేని అర్హులను లబ్ధిదారులుగా గుర్తించారు కానీ వారికి స్థలాలు కేటాయించలేదని దుయ్యబట్టారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తామని ఇచ్చిన హామీల మేరకు ఇళ్ల స్థలాలు కేటాయించి, పట్టాలు మంజూరు చేయాలని, ఐదు లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం పెంటపాడు మండల తహసీల్దార్ ఏడిద కోట శ్రీనివాస్‌కు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ

సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల విషయమై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, తమకు ఎటువంటి సూచనలు ఇవ్వలేదని, అధికారికంగా ఇళ్ల స్థలాల విషయమై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే మండలంలోని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందించే దిశగా పనిచేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు వంకా అప్పారావు, ఎస్ఐ కార్మిక సంఘం మండల కార్యదర్శి దిద్దే నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు కొణతాల నాగరాజు, ఉయ్యూరి సత్యనారాయణ, మోర్చ రాజేష్, దున్న జాన్ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉండి : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలివ్వాలని పెద్ద ఎత్తున నినదించారు. ఈ సందర్భంగా కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వటంలో ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇళ్ల స్థలాలు లేక పేదలు అనేక అగచాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. అద్దెలు కట్టుకోలేక సొంత ఇల్లు లేక దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకున్న నాధుడే కరవయ్యాడని విమర్శించారు. ఇప్పటికైనా అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు పట్నంలో రెండు

సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక తహసీల్దార్ కావడి నాగార్జునకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు సన్నపాల శ్రీను ,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తమరాని శ్రీనివాసు, మహాదేవపట్నం శాఖా కార్యదర్శి కోన గొల్లయ్య, వాడపల్లి వెంకటరమణ, శిరవరపు భవాని, ఈ ల్లాపు బాల త్రిపుర, కొట్టాడ నాగేశ్వరి ,కొల్లా దుర్గ, షేక్ ఫాతిమా, అడ్డాల పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సొంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న నిరు

పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఇళ్లులేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో విస్సాకోడేరు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఇళ్ల స్థలాలకై సర్పంచ్ బొల్లా శ్రీనివాస్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ళు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు కేటాయిస్తామన్న వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే దశలవారీగా పోరాటాలను చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై.వి.ఆనంద్, ఎం.లక్ష్మీపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు : సొంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి

తహసీల్దార్ డి.వి.ఎస్.ఎస్ అశోక్ వర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొద్దాని నాగరాజు మాట్లా డుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ళు లేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాలు కేటాయిస్తామన్న వాగ్దానం అమలు చేయాలని కోరారు. గృహ నిర్మాణానికి 5 లక్షలు రూపాయలు మంజూరు చేయాలన్నారు. అసంపూర్ణంగా ఉన్న టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తిచేసి అర్హులందరికీ అందించాలన్నారు, ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పులపర్తి సత్యనారా యణ, బొద్దాని మురళీకృష్ణ, పుట్టా అమ్మిరాజు, పి.దత్తాత్రేయప్రసాద్, కట్టుంగ శంకర్, బొద్దాని కృష్ణ కిషోర్, దేగల హనుమంతరావు, కోదాడ సుధీర్‌బాబు, నమ్మి రాజు, బొద్దాని రాజు, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవకు చిరునామా.. 'నడపన జగపతి'

విశాలాంధ్ర - పాలకొల్లు : నిజమైన సేవకు చిరునామాగా నిలిచారు నడపన జగపతి రావు. పాలకొల్లు మండలం తిల్లపూడి గ్రామంలో ఓ చిన్న రైతు కుటుంబంలో జన్మించారాయన. ఐటిఐ చదువుకొని ఎలక్ట్రీషియన్‌గా జీవితాన్ని ప్రారంభించిన నడపన జగపతి, అనతికాలంలోనే ఇంతింతై వటుడింతై అన్నచందంగా అసమాన్యుడిగా ఎదిగారు. మంచి మనసున్న మనిషిగా, సేవకు ప్రతిరూపంగా, పాలకొల్లు నియోజకవర్గ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, నేడు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. డబ్బు సంపాదించడం గొప్ప కాదని, సంపాదించిన డబ్బును సక్రమంగా వినియోగించడం, ఉన్నంతలో పదిమందికి సహాయపడడం గొప్ప లక్షణమని ఆయన తరచు అంటూ ఉంటారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అనేకమంది పేదలకు, ఆపన్నులకు జగపతి సహాయం చేస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి సహాయపడడం, మంచి పనులకు నేనున్నానంటూ ముందు ఉండడం ఆయనకు నిత్య కృత్యంగా మారిందంటే అతిశయోక్తి కాదు. సమాజ సేవలోనే కాదు.. విద్యారంగానికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో సైతం, విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను అందించడంలో తనదైన మార్కు వేసుకున్నారు నడపన జగపతి. విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పన చేయడంలో, చేయూతను అందించడంలో ఎల్లవేళలా ముందుంటూ.. విద్యార్థుల పురోగతికి ఎంతగానో దోహదపడు తున్నారు. అడిగిందే

తడవుగా పాఠశాలలలో అవసరమైన అవసరమైన మౌలిక సదుపాయాలనూ కల్పిస్తూ, దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఇక రాజకీయ రంగంలో సైతం ప్రవేశించి, ప్రజల మన్ననలు అందుకుంటున్నారీయన. మంచి వ్యక్తిత్వం కల వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు.పట్టుదల కార్యదక్షతలతో అహర్ని శలు శ్రమించి నేడు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ విషయమై జనస్వరం ప్రతినిధితో జగపతి మాట్లాడుతూ.. సేవ చేయడంలో ఉండే ఆనందం వెలకట్టలేని దన్నారు. తల్లిదండ్రులు చిన్ననాటి నుండే తమ పిల్లలకు సేవా భావాన్ని నేర్పాలని, ఉన్నంతలో పదిమందికి సహాయం చేసినప్పుడే జన్మ సార్థకం అవుతుందని చెప్పారు. భవిష్యత్తులో తన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు.

11 నుంచి ఎమ్మెల్యే కప్ సౌత్ స్టేట్ లెవెల్ వాలీబాల్ పోటీలు

విశాలాంధ్ర - పాలకొల్లు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా గత 11 సంవత్సరాలుగా ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎమ్మెల్యే కప్ సౌత్ స్టేట్ లెవెల్ వాలీబాల్ పోటీలు ఈనెల 11వ తేదీ నుంచి జరుగుతాయని ధర్మారావు ఫౌండేషన్ చైర్మన్, మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం పాలకొల్లు బి.ఆర్.ఎం.వి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను మంత్రి వెల్లడించారు. పాలకొల్లు బి.ఆర్.ఎం.వి. ఉన్నత పాఠశాల గ్రౌండ్లో మూడు రోజుల పాటు రాత్రి, పగలు ఫ్లడ్ లైటింగులో జరిగే ఈ పోటీలు ఈ ఏడాది ప్రముఖ ఆడిటర్ కలిదిండి రామరాజు పేరిట జరుపుతున్నామన్నారు.

13న ముగింపు సంబరాలు: సంక్రాంతి సంబరాల ముగింపు వేడుకలు 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జరగనున్నాయని మంత్రి రామానాయుడు తెలిపారు.

ఈ సందర్భంగా మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా సంక్రాంతి పండుగ చాటి చెప్పేలా వివిధ రకాల పిండి వంటలు, పాటలు, జానపద నృత్యాలు, గంగిరెద్దుల సన్నాయిలు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, బొమ్మల కొలువు, కోలాటాలు వంటి పల్లె కళారూపాలు ఎన్నో కార్యక్రమాలతో సందడిగా మారుతుంది. వీటితోపాటు సినీ గాయకురాలు మౌళవిక,

సినీ గాయకుడు రఘు కుంచే, సినీ నటులు ప్రదీప్, జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్, నరేష్, జితేంద్ర, శ్రీదేవి డ్రామా కంపెనీ ఫేమ్ సత్య తదితర కళాకారులతో, సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో మహిళలకు జరిగిన ముగ్గుల పోటీ విజేతలకు, వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జనసేన నాయకులు బన్నీ వాసు, బోణం చినబాబు, బిజెపి నాయకులు ఉన్నమట్ల కబర్ధి, యర్రం శెట్టి పద్మారావు తదితరులు పాల్గొంటారన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు బకాయి ఉన్న జీతాలు చెల్లించాలి

విశాలాంధ్ర- చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు,పిఎఫ్, ఈఎస్ఐ, నిధులు విడుదల చేయకపోతే ఈనెల 24వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు తెలిపారు.

చింతలపూడి ఏరియా ఆసుపత్రి పర్యవేక్షణాధికారికి నోటీసు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 18 నెలల పిఎఫ్, 5నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినట్టు తెలిపారు. శుక్రవారం చింతలపూడిలో కూడా సమ్మె నోటీసు కాపీని ఇచ్చామని, కాంట్రాక్టర్‌కు ఈనెలతో కాంట్రాక్ట్ ముగుస్తుందని, తక్షణం పిఎఫ్, పెండింగ్ జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్క పారిశుద్ధ్య కార్మికుడికి లక్ష రూపాయలు బకాయి ఉందని, వీటిని చెల్లించకుంటే ఈనెల 24వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో చింతలపూడి ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు తుర్లపాటి మరియమ్మ, జి. వెంకట్రావు, పసుపులేటి వాణి, తదితరులు పాల్గొన్నారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

కార్పొరేట్ ఆఫీస్ : 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015, తమిళనాడు, ఇండియా. www.hindujahousingfinanace.com

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధనలు 9(5), మరియు 9(1) కింద రుణగ్రహీతకు స్థిర ఆస్తి అమ్మకపు నోటీసు

టు, తేదీ: **10-01-2025**

1.శ్రీ రషీద్ షేక్ (రుణగ్రహీత) 2.శ్రీమతి అమ్మాజీ షేక్ (సహ-రుణగ్రహీత)

ఆర్/ఓ. డోర్ నెం:- 1-64/2, ముస్లిం వీధి, విటిసి: తిమ్మరాజుపాలెం, పిఓ: తిమ్మరాజుపాలెం, సబ్ జిల్లా: నిడదవోలు, పశ్చిమగోదావరి జిల్లా, ఏపి-534301.

విషయం: సర్ఫేశీ చట్టం, 2002 కింద హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ ద్వారా హామీగా పెట్టిన ఆస్తి విక్రయం

రిఫరెన్స్: రుణ ఖాతా నం. AP/RAJ/THRD/A000000427 & AP/RAJ/THRD/A000000672

డియర్ మేడమ్(లు)/ సర్(లు),

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (ఇకమీదట సెక్యూరిటైజేషన్ చట్టం చదివేది) కింద రూపొందించబడిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల యొక్క రూల్ 2(ఎ) ప్రకారం 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై - 600 015, తమిళనాడు, ఇండియా వద్ద కార్పొరేట్ కార్యాలయం మరియు 54-20-10/1ఎ, ప్లాట్ నెం: 43, 3వ అంతస్తు, ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా, మెయిన్ రోడ్, గురునానక్ కాలనీ, విజయవాడ, పిన్- 520 008 నందు బ్రాంచ్ కార్యాలయం కలిగియున్న ఎం/ఎస్. హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారిగా నేను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు,2002 యొక్క నియమాలు 8(5) మరియు 9(1) ప్రకారం మీకు ఈ నోటీసును జారీ చేడమైనది. అదే క్రింది విధంగా ఉంది:-

1. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి మీకు పంపిన నోటీసులో ప్రస్తావించిన విధంగా స్థిర ఆస్తి(హామీగాపెట్టిన ఆస్తి)కి సంబంధించి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సర్ఫేశీ చట్టం) మరియు దాని కింద పొందుపరచిన నిబంధనల కింద సెక్యూర్డ్ క్రెడిటార్స్‌కు సంక్రమించిన అధికారాలను వినియోగించి హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్) ద్వారా తేదీ: **25-04-2023** న రోజువారీ వార్తాపత్రికలు అంటే 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ & ప్రజాశక్తి'లో ప్రచురించిన జారీ చేసిన **20-04-2023** నాటి స్వాధీనత నోటీసును మరియు హామీగా పెట్టిన ఆస్తి వద్ద స్పష్టమైన ప్రదేశంలో అతికించిన నోటీసు ను దయచేసి చదువగలరు. కోర్టు నియమించిన రిసీవర్ **15-12-2023**న ఆస్తిని భౌతికంగా స్వాధీనం చేసుకోవడమైనది.

2. ఈ రోజు వరకు, మీరు మీ బకాయిలను పూర్తిగా హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ కి చెల్లింపు చేయనందున సర్ఫేశీ చట్టం మరియు దానికింద రూపొందించిన నిబంధనల ప్రకారం హామీగా పెట్టిన ఆస్తిలో దిగువ పేర్కొన్న భాగాన్ని విక్రయించాలని హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ ప్రతిపాదిస్తోంది. హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ హామీగాపెట్టిన ఆస్తిని బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని భావిస్తోంది. హామీగా పెట్టిన ఆస్తి అత్యధిక బిడ్/కొనుగోలు ధరను అందించే ఉద్దేశిత కొనుగోలుదారులలో ఒకరికి విక్రయించబడుతుంది. ఇది నిర్ణయించిన రిజర్వ్ ధర **రూ6,00,000/- (ఆరు లక్షల రూపాయలు మాత్రమే)** కంటే తక్కువగా ఉండదు.

సీలువేసినబిడ్/ఆఫర్‌ను సమర్పించడానికి చివరి తేదీ: **28-01-2025** మరియు వేలం తేదీ: **29-01-2025**. వేలం నోటీసు తేదీ: **11-01-2025** న రెండు రోజువారీ వార్తాపత్రికలలో అంటే వరుసగా **'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్'** మరియు **'విశాలాంధ్ర'లో** కూడా ప్రచురించబడింది.

3. మీరు పొందిన రుణానికి సంబంధించి రుణ ఒప్పందం మరియు ఇతర పత్రాలలో పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం **08-01-2025 నాటికి రూ.35,34,019/- (ముప్పై ఐదు లక్షల ముప్పై నాలుగు వేల పంతొమ్మిది రూపాయలు మాత్రమే)** లను తదుపరి వడ్డీ పీనల్ వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలతో కలిపి ఈ నోటీసు వచ్చిన 15 రోజులలోపు చెల్లించడంలో విఫలమయినట్లయితే ఈ క్రింద పేర్కొన్న హామీగా పెట్టిన ఆస్తి వేలం/ప్రైవేట్ ఒప్పందంలో విక్రయించబడుతుందని మేము మీకు నోటీసు ఇవ్వడమైనది.

ఇంతకుముందు కూడా వేలం నిర్వహించబడినప్పటికీ రిజర్వ్ ధరకు సమానమైన బిడ్ రాలేదు. నిర్ణీత గడువులోగా మీరు మొత్తం బకాయిలను చెల్లించనట్లయితే మీకు తదుపరి ఎలాంటి నోటీసు ఇవ్వబడదు మరియు దిగువ పేర్కొన్న హామీగాపెట్టిన ఆస్తి ప్రైవేట్ ఒప్పందం ద్వారా విక్రయించబడుతుంది. హామీగాపెట్టిన ఆస్తి విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని సర్దుబాటు చేసిన తర్వాత హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ కి మీరు చెల్లించాల్సిన రుణం మొత్తంలో ఏదైనా మిగిలి ఉంటే... అది మీ నుండి వసూలు చేయబడుతుందని గమనించగలరు.

స్థిర ఆస్తి యొక్క వివరాలు (హామీగా పెట్టిన ఆస్తి) :

పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు ఎస్ఆర్ఓ పరిధి, నిడదవోలు మండలం, నిడదవోలు మున్సిపల్ ఏరియానందు ఉన్న ఆర్.ఎస్.నం. 289లో డోర్ సం.13-11-2 మరియు 13-11-2/1 ఆధారంగా ఉన్న 179 చదరపు గజాల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో నిర్మించిన ఆర్.సి.సి. భవనం మరియు భూమి మొత్తంగా. హద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్డు, దక్షిణం: బి.ప్రమీలారాణికి చెందిన స్థలం, పడమర: కె.భాస్కరరెడ్డికి చెందిన స్థలం, ఉత్తరం: ఎన్.రాజా విదురాయమ్మకు చెందిన స్థలం.

మీ విశ్వాసపాత్రుడు,

హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున

(అధీకృత అధికారి)

మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-కామవరపుకోట: పాఠశాలల్లో చిన్నారులైన విద్యార్థినీ విద్యార్థులను తల్లిలా ఆదరించి ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేసి చిన్నారులకు గోరుముద్దలు తినిపించి ఎందరో పసిపిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షులు టీవీఎస్ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కామవరపుకోట ఆర్ అండ్ బి బంగ్లా ఆవరణలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఏలూరు జిల్లా సీనియర్ కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీవీఎస్ రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధ్యాయుల కంటే ముందుగా పాఠశాలకు వచ్చి పాఠశాలల్లో పదుల సంఖ్యలో ఉన్న విద్యార్థులకు వంట చేసి వడ్డించి చిన్నారులకు గోరుముద్దలు తినిపించి ప్రేమతో విద్యార్థులను అభిమానించి ఆదరిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ మంత్రులు, ప్రభుత్వాలు

మారినా కార్మికుల జీవన విధానంలో ఎలాంటి మార్పులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కీం వర్కర్స్ అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు జరపడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. గత 20 సంవత్సరాలుగా పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేసి వారి ఆకలి తీరుస్తున్న మహిళా కార్మికులు అందిస్తున్న సేవలను గుర్తించాలన్నారు. బి.పుష్ప నక్క కృష్ణవేణి సమావేశానికి అధ్యక్షవర్గంగా వ్యవహరించగా శాంతమ్మ, నేలపాల సత్యవతి, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కోడిపందేలు, బెట్టింగుల నియంత్రణ చర్యలు

విశాలాంధ్ర - ఏలూరు : ఆంధ్ర ప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హై కోర్టు వివిధ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యముల కేసు విషయంలో 2016లో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం, పక్షులు, జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం, 1960 ఆంధ్ర ప్రదేశ్ గేమింగ్ చట్టం,1974 ప్రకారం కోడిపందేలు,బెట్టింగ్ లు నిర్వహించుట, ప్రోత్సహించుట ,పాల్గొనుట చట్ట విరుద్ధమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. ఉత్తర్వులను అతిక్రమించినచో సంబంధిత చట్టముల ప్రకారం శిక్షార్హులు అని హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా పై ఉత్తర్వులను అతిక్రమిస్తే సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ఫోన్ నెం.08812-224519 లేదా టోల్ ఫ్రీ నెం.1800-2331077కు సమాచారం తెలియజేయాలని కోరారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, ఏలూరు జిల్లా, రెవిన్యూ డివిజనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కార్యాలయంలో - 9550351100/112, ఏలూరు ఆర్డిఓ కార్యాలయంలో 7842530956, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08656-232717,జంగారెడ్డిగూడెం ఆర్డిఓ కార్యాలయంలో 8309705048 నెంబర్లతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గీతాంజలిలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర- ఉండి : గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూలులో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ముందస్తుగా భోగిమంట, రంగవల్లులు, గొబ్బెమ్మలు, కోలాటం, నృత్య ప్రదర్శనలు, పంచకట్టు, లంగా వోని జాకెట్టు, సత్యభామ, శ్రీకృష్ణుని వేషధారణ, విద్యార్థులు చూపరులను ఆకర్షించారు. ఆనం దోత్సవాలు, కోలాహలంగా, ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఉపాధ్యాయులు విద్యార్థులు పిల్లల తల్లిదండ్రులు అని తేడా లేకుండా శుక్రవారం స్కూలు ఆవరణలో సమయం గడిపారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్కూల్ ఆవరణలో సంక్రాంతి

పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు ఉట్టిపడేలా స్కూలు ఆవరణ దర్శనమిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పెంటపాడు : విశాలాంధ్ర 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం పెంటపాడు మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ సిహెచ్. బాలాజీ వెంకటరమణ

ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వార్తాపత్రికలలో విశాలాంధ్ర పత్రికకు ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదని, ఈ పత్రికలో ప్రచురితమయ్యే ప్రతి వార్త వాస్తవికంగా ఉంటాయని, నిజమే నిర్భయంగా ప్రచురితం చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి వైఎన్ఆర్‌వి ప్రసాద్, పరిపాలనాధికారి టీవీ.సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ డి.రాజేంద్ర కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ టీపి వై.రామకృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాజు, సిపిఐ మండల కార్యదర్శి కే.లక్ష్మణ రావు, రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

విశాలాంధ్ర-లింగపాలెం: వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు దరఖాస్తుదారులు పెట్టుకున్న అర్జీలను పరిశీలించేందుకు నూజివీడు రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ ధర్మాజీగూడెం, లింగపాలెంలో పర్యటించారు.

ఈయనతో పాటు స్థానిక తహసిల్దార్ నజీమ్, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు. భూములను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, న్యాయమైన సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రెవిన్యూ పరమైన ఏ సమస్య వచ్చినా ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఉండాలని అన్నారు. కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదారులతో మంచిగా వ్యవహరించాలని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు బహూకరణ

విశాలాంధ్ర -భీమడోలు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భీమడోలు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికు లకు, సర్పంచ్, కార్యదర్శి కలసి నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ,

తెలుగు వారి గొప్ప పండుగ సంక్రాంతి అని అందరు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పంచాయతీని నిత్యం కంటికి రెప్పలా కాపాడుతూ పనిచేస్తున్న వర్కర్స్ క్షేమం ముఖ్యమన్నారు. కార్యదర్శి మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతలో కీలకపాత్ర పారిశుద్ధ్య కార్మికులదే అన్నారు. మంచినీరు, వీధిలైట్స్ మొదలగు పనులు వారివలననే సాధ్యం అని అన్నారు.

కోడిపందాల బరులు ధ్వంసం

విశాలాంధ్ర-టి నరసాపురం: సంక్రాంతిని పురస్కరించుకొని కోడిపందాల నిర్వహణకు సిద్ధం చేసిన బరులను తహశీల్దార్ సాయిబాబా, ఎస్ఐ ఎం.జయబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం చేశారు. స్థానిక పామాయిల్ తోటలో పందెం రాయుళ్లు సంక్రాంతికి ముందు గానే బరులు సిద్ధం చేయడంతో సమాచారం

తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆ స్థలానికి చేరుకుని జెసిబి సాయంతో ధ్వంసం చేశారు. కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో పేకాట, గుండాట వంటి జూదక్రీడలు నిర్వహించొద్దని ఎక్కడైనా ఇటువంటి కార్యకలాపాలు సాగిస్తున్న వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది హరిబాబు, ఫణి కుమార్, కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఇసుక ర్యాంపులు : ఆర్డీవో

విశాలాంధ్ర -కొవ్వూరు : డివిజన్ పరిధిలోని అన్ని ఇసుక ర్యాంపులు ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ సక్రమంగా నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత పేర్కొన్నారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని ఎర్నమ్మ ఇసుక ర్యాంపును ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ కొవ్వూరు పరిధిలోని పడవలపై ఇసుక తవ్వే ర్యాంపులలో, కొన్ని ర్యాంపులు మినహా మిగిలిన రాంపులకు రెన్యువల్ చేయడం జరిగిందని అన్నారు. రాంపులలో అధిక ధరలను నియంత్రించడం జరిగిందని ఎవరైనా అధిక ధరలు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పమన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ ఇసుక ర్యాంపుల నిర్వహణ జరిపించాలని తెలిపారు.

కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర- కొవ్వూరు : కొవ్వూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో రంగవల్లులను తీర్చిదిద్ది భోగిమంటలను వెలిగించి సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థినీలు సాంప్రదాయ దుస్తులను ధరించి, నృత్యాలను ప్రదర్శించారు. విద్యార్థినీల ఆటపాటల మధ్య ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

టెక్నాలజీతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి - సూరపనేని

విశాలాంధ్ర -కొవ్వూరు : టెక్నాలజీని వినియోగించుకుని రాష్ట్రంలో అన్ని వృత్తుల వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ సూరపనేని చిన్ని తెలిపారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నందు సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు ఫేస్ వన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురపనేని చిన్ని మాట్లాడుతూ చేతి వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలని సంకల్పంతో సర్వీస్ ప్రొవైడర్స్ యాప్ ను ప్రవేశపెట్టి దీని ద్వారా అన్ని చేతివృత్తుల వారికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు ప్రతి సభ్యులు తమ వృత్తులను తమ పేర్లను యాప్ ద్వారా నమోదు చేయించుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్ భారతీయ జనతా పార్టీ నాయకులు గంట్లోతు పవన్, మెప్మా సి ఓ లు, ఆర్పీలు వివిధ వృత్తిదారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సత్యవతి దేవి బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - రాజానగరం : రాజానగరం మండలం తహశీల్దారుగా జి.ఎ.ఎల్.సత్యవతి దేవిని నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సత్యవతి దేవి తహశీల్దార్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని వీఆర్వో యూనియన్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల వీఆర్వోలు ఘన స్వాగతం పలికిన పుష్పగుచ్ఛాలు అందజేశారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం లోని కలెక్టరేట్ కార్యాలయంలోని కో ఆర్డినేషన్ శాఖాధికారిగా విధులు నిర్వహించిన సత్యవతి దేవి డిప్యుటేషన్‌పై రాజానగరం విచ్చేశారు. రాజానగరం తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన లావణ్య కలెక్టరేట్ కో ఆర్డినేషన్ కార్యాలయానికి బదిలీపై వెళ్ళారు. వీఆర్వో యూనియన్ జిల్లా అధ్యక్షులు సానా శ్రీనివాస్, మండల అధ్యక్షులు కె.నరసింహారావు(జాన్) వీఆర్వోలు కె.నాగేశ్వరరావు,టి.హరి మోహన్, ఆర్.నాగేశ్వరరావు, చంద్ర, హౌసింగ్ బోర్డు శ్రీనివాస్, జి.సుబ్బారావు,తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సీతానగరం: మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం 2025-26 బడ్జెట్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఓ ఎమ్ భారతి ఆధ్వర్యంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్య అతిథిగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరు కావడానికి వచ్చిన ఎమ్మెల్యే భక్తులకు రామచంద్రపురం గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలు తనకు రెండు సంవత్సరాలుగా పెన్షన్ అందడం లేదని దయచేసి పెన్షన్ మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సర్వసభ్య సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అనేక శాఖల అధికారులు తమ తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలపై ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధిలో అధికారులు నాయకులు ఒకరికొకరు సహకరించుకుంటూ అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. అలాగే తమ దగ్గర నుండి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం అనుకున్న సమయం కన్నా ఆలస్యంగా ప్రారంభం కావడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చలమల వెంకటలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ ఐ రామ్ కుమార్, సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, ఎమ్ ఈ ఓ స్వామి నాయక్, అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేలు వద్దు సాంప్రదాయ క్రీడలే ముద్దు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గోపాలపురం : కోడిపందేలు వద్దు సాంప్రదాయ క్రీడలే ముద్దు అంటూ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దేవరపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ నాయక్ తెలిపారు. శుక్రవారం గోపాలపురంలో సీఐ నాయక్ ఆధ్వర్యంలో కోడి పందాల బరులు వద్ద గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ అధినేత మధు కృష్ణ యువతతో కలిసి కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారుచేసారు. ఈ సందర్భంగా దేవరపల్లి సిఐ నాయక్ యువతతో కోడిపందేలు వద్దు ఆటపాటలే ముద్దు అని నినాదాలు చేయించారు. సీఐ నాగేశ్వర్ నాయక్ మాట్లాడుతూ జూద క్రీడలు మాని సాంప్రదాయ క్రీడలకు యువత పట్టం కట్టాలని నూతన సాంప్రదాయాలకు తెరలేపి కుటుంబ సభ్యులతో ఆనందంగా సంక్రాంతి పండుగ నిర్వహించి తెలుగువారి సాంప్రదాయ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు. అనంతరం గోపాలపురం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో పోలీసులు ఒక టీం ఏర్పడి క్రికెట్ ఆడి యువతలో ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ అధినేత గంట మధు కృష్ణ, కొర్లపాటి రాము, యద్దనపూడి బ్రహ్మ రాజు,పసుమర్తి రతీష్, పినమనేని నాగేంద్ర, పడమటి శ్రీనివాసరావు, పలువురు నాయకులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు 'విశాలాంధ్ర'

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కార్మికుల పక్షాన అక్షరాయుధాలతో నిరంతరం పోరాటం చేసే 'విశాలాంధ్ర' పేదప్రజల గుండె చప్పుడని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషనల్ ఎస్పీ ఏవిఆర్‌పి బి ప్రసాద్ అన్నారు. శుక్రవారం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రసాద్, వాడపల్లి దేవస్థానం ఆలయ డిప్యూటీ కమిషనర్ యన్ చక్రధర్ రావు, రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఆత్రేయపురం మండలం ఎస్సై ఎస్ రాము, రిపోర్టర్ కె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'హరిదాసు' గానం

విశాలాంధ్ర - సామర్లకోట : సంక్రాంతి పండుగ అంటే తెలుగు లోగిళ్లలో అంబరాన్ని అంటే పెద్ద పండుగ, సంక్రాంతికి నెల రోజుల ముందు నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ధనుర్మాసం నెల రోజులూ ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లులు, ఆవు పేడతో గొబ్బెమ్మలు వేయడంతో నిండుగా కనిపిస్తాయి. ఉషోదయం వేళ సుదూరంగా విని పించే అద్భుతనాదం, అమృతగానం ఆ చివర కృష్ణార్పణం అంటూ గ్రామీణ ప్రాంతాలలో, పట్టణాల్లో వీధివీధిన తిరుగుతూ ఉండే దాసు.. హరిదాసు, గజగజమని వణికించే వేళలలో కొక్కరోకో అని తొలి కోడి కూసే వేళలలో అందంగా కట్టుకున్న బంగారు రంగు అంచు పట్టుపంచెపై పట్టు వస్త్రాన్ని నడుముపై ఉంచి తలపాగా తలకు చుట్టి మెడలో పూలదండతో, భుజాలపైన, చాతీ మీద నామాలతో భుజాన తుంబరతో ఒక చేత్తో చిడతలు, మరో చేత్తో తుంబర మీటుతూ తలతలలాడే రాగిపాత్ర శిరస్సుపై ఉంచు కుని ఒక పాదంపై బరువు నుంచి మోకాలు నేలకు మోపి వినయంగా కూర్చొని తలవంచి తలపైనున్న అక్షయ పాత్రలో గృహ యజమానురాలు స్వయం పాకం వేసేటప్పుడు హరిదాసు పలికే పథం కృష్ణార్పణం. సామర్లకోటలో సత్యనారా యణపురం వీధిలో ప్రతిఇంట తిరుగుతూ హరినామ సంకీర్తనలు పాడు తూ హరిదాసు కనిపించడంతో పిల్లలు, పెద్దలు ఆనందంతో వారి వద్దకు వచ్చిన హరిదాసును ఆదరిస్తారు. సంక్రాంతి మాసాన హరిదాసు లేనిదే సంక్రాంతి పండుగ లేదు.

కార్మికులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ

విశాలాంధ్ర-దేవరపల్లి : కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయమని దేవరపల్లి శ్రీ కృష్ణ ప్లైవుడ్ ఇండస్ట్రీస్ అధినేత డాక్టర్ శ్రీకాకుళం కాశీ కృష్ణపేర్కొన్నారు. దేవరపల్లిలో శుక్రవారం కృష్ణా ప్లైవుడ్ ఇండస్ట్రీ ఆవరణలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ప్రత్యక్ష, పరోక్ష కార్మికులకు దుస్తులు, స్వీట్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కార్మికుల క్షేమం కోసం ప్రతి సంవత్సరం పండుగ సందర్భంగా వారికి ప్రోత్సాహకాలు, దుస్తులు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాశీ కృష్ణ తండ్రి దేవరపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు శ్రీకాకుళపు వెంకట నరసింహారావు చేతులమీదుగా దుస్తులు, పండ్లు, స్వీట్లు, కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ ప్లై వుడ్ ఇండస్ట్రీస్ సీఈవో శ్రీకాకుళం మోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి పర్వదినం

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తెల్లారుజామున ఆలయ అర్చకులు మొక్కపాటి శేఖర్ శర్మ ఆధ్వర్యంలో నల్లమాటి నరేష్, కోటేశ్వరి దంపతులు పీటల మీద కూర్చుని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఉత్తర ద్వారం దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా విష్ణు సహస్ర నామ కల్చర్ ఫెడరేషన్ సభ్యులు బలుసు సత్యనారాయణ విజయలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు

ప్రాచీన సాంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర - కడియం : ప్రాచీన సంప్రదాయ కళలను వాటికి జీవంపోసే కళాకారులను పరిరక్షించుకోవాలని, లేనిచో కనుమరుగయ్యే ప్రమాద ముందని మండల విద్యాశాఖాధికారులు ఎం మణికుమార్, వై నాగేశ్వరరావు అన్నారు. కడియం మండలం వేమగిరి తోటలో రామాలయం వీధి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె జయరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనంనుండి సాంప్రదాయ కళలపై అవగాహన, సహనం, ఓర్పు, నేర్పు అలవర్చుకోవాలన్నారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు, వి లజపతిరాయ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యతోపాటు ప్రభుత్వ , సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, అంగన్వాడీ టీచర్లు, సర్వశిక్ష ఇంజినీర్ కె వీరభద్రరావు, ఎస్ సతీష్ బాబు, ఎం కుమారీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవం

విశాలాంధ్ర - కాకినాడ : గాంధీనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి సభ్యులు, టిడిపి 41వ వార్డు ఇంచార్జ్ జొన్నాడ వెంకటరమణ, టిడిపి సిటీ అధ్యక్షులు ముల్లపూడి వీరు, కూటమి తెలుగుదేశం, జనసేన, బిజెపికు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుటుంబ సభ్యులు, జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్‌లు దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అర్చకులు సత్యానందరావు కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరుటూరి నరసింహరావు, ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), కంఠంశెట్టి శ్రీనివాస్, వంటిపల్లి పాపారావు, మైగపుల గురవయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలపై పిల్లలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - కడియం : మన సంస్కృతి సంప్రదాయాలను చిన్నతనం నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలని ఏసిడిపిఒ టి కనకవల్లి అన్నారు. కడియం గ్రామంలో అంగన్వాడీ కేంద్రం మేకల దెబ్బ కడియం - 6 సెంటర్ నందు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు భోగి పళ్ళు వేసి, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసిడిపిఒ టి కనకవల్లి హాజరై బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కడియం గ్రామం అంగన్వాడీ టీచర్స్, తల్లులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకుంటే డ్యూటీలు చేయ్యలేం

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ హెచ్చరిక

విశాలాంధ్ర - అమలాపురం : స్వయంభు ఏజెన్సీ ద్వారా అమలాపురం పురపాలక సంఘం మున్సిపాలిటీ చెత్త సేకరణ కొరకు వినియోగించే ఆటోటిప్పర్ వాహనాల డ్రైవర్‌లకు నవంబర్, డిసెంబర్ నెల వేతనాలు స్వయంభూ సంస్థ యాజమాన్యం చెల్లించిడంలేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తెలిపింది. ప్రతినెలా 5న రాష్ట్రం కార్మికులు అందరికి వేతనాలు అలవెన్సులు చెల్లింపులు జరుపుతామని అగ్రిమెంట్ ప్రకారం చెల్లించవలసి ఉన్నప్పటికీ. జీతాలు ఇవ్వకుంటే డ్యూటీలు చేయలేమని, ఈ తరహా మానసిక పరిస్థితుల్లో మన డ్రైవర్ సోదరులు సక్రమంగా విధులు నిర్వర్తించ లేమని, అనివార్యంగా 11 నుంచి విధులు నిర్వర్తించలేమని మా కార్మిక సోదరులు నిరాసక్తతను తమ ముందు ఉంచుతున్నామని, కుంచె అరుణ కుమారి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్-ఆటో టిప్పర్ డ్రైవర్స్ సంఘం. ఏఐటీయూసీ అనుబంధం హెచ్చరించారు.

డిప్యూటీ సీఎం రోడ్డు పనుల తనిఖీ

విశాలాంధ్ర - రాజానగరం,సీతానగరం,రంగంపేట : తూర్పుగోదావరి కాకినాడ జిల్లాలను అనుసంధానం చేసే ప్రధాన రహదారైన ఆసియా డెవలప్మెంట్ బ్యాంకు (ఏడిబి) రోడ్డు నిర్మాణ పనులను ఏపీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుదీర్ఘ కాలంగా రహదారి మార్గం పనులు చేపట్టడం వల్ల కలిగే ఇబ్బందులపై అధికారులను అనేక వివరాలు అడిగి తెలుసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ అంశాలను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజానగరం - సామర్లకోట ప్రధాన రహదారి మార్గంలో నాలుగు వరసల రహదారిగా అభివృద్ధికి చెంది 30 కిలోమీటర్ల దూరం ఉండగా, దానిలో 16.29 కిలోమీటర్లు మేరకు తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఉందన్నారు. రూ:189 కోట్ల 87 లక్షల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు పనులకి సంబందించి 2017లో పరిపాలన ఆమోదంతో 2018లో అక్టోబరు నెలలో పనులు చేపట్టడం జరిగిందని, వీటిని 2021ఫిబ్రవరిలో పూర్తి చేయ్యాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయడంతో పాటు 2025 ఆగష్టు నాటికి పూర్తి చేసేలా ఆసియన్ డెవలప్మెంట్ బ్యాంకు(ఏడిబి) అధికారులు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. ఆ మేరకు పనులని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు కలెక్టరు ప్రశాంతి వివరించారు. మార్గమధ్యంలో ఎస్టీ రాజపురం వద్ద కల్వర్టు నిర్మాణ పనులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలించారు. రాజానగరం మండలంలో రాజానగరం, రాజానగరం ట్రంపేట్, కానవరం గ్రామాలు, రంగంపేట మండలంలో రంగంపేట, వడిసలేరు, కోటపాడు, పెద రాయవరం, ఎస్టి రాజపురం గ్రామల పరిధిలో ప్రతిపాదించిన పనులు

చేపట్టడం జరిగిందన్నారు.

ప్రమాద స్థలం పరిశీలన

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శుక్రవారం పిఠాపురం పర్యటనకు వెళ్లేందుకు తొలుత రాజానగరం నియోజకవర్గంలోని మధురపూడి విమానాశ్రయానికి శుక్రవారం చేరుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఏలూరు రేంజి డిఐజి జీవివి అశోక్ కుమార్, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్ రావు,ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజానగరం మీదుగా పిఠాపురంలో జరిగే సభలో పాల్గొనేందుకు రోడ్డు మార్గంలో తరలివెళ్లారు. ఇటీవలే గేమ్ ఛేంజర్ ఈవెంట్ వేడుకకి హాజరై తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో కాకినాడ జిల్లా, రంగంపేట మండలం ముకుందవరం గ్రామం వద్ద ప్రమాదవశాత్తు మృతి చెందిన చరణ్, మణికంఠ అనే యువకులు మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఆ యువకులు మృతికి కారణమైన ప్రమాదా స్థలాన్ని పరిశీలించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్,ఎస్పీ విక్రాంత్ పటేల్ ఇతర అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, డిఎస్పీ భవ్య కిశోర్, ఏపి రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దేవదాయ భూమి స్వాధీనం : నాగేశ్వరరావు

విశాలాంధ్ర - రాజానగరం : మండల కేంద్రమైన రాజానగరంలోని శ్రీ రాజా కాండ్రేగుల జోగి జగన్నాధరావు పంతులు బహదూర్ వారి అన్నదాన సత్రానికి చెందిన సుమారు రూ.50 కోట్ల విలువైన మొత్తము య.25.16 సెంట్లు సత్రం భూములను స్వాధీనం చేసుకున్నమని తూర్పు గోదావరి జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖాధికారి కె.నాగేశ్వరరావు,తనిఖీదారు టీవీఎస్.ఆర్ .ప్రసాద్, సత్రం కార్యనిర్వహణాధికారి డి.సురేష్ బాబు చెప్పారు. ఇందుకు సంబంధించి స్థానిక విలేకరులకు పత్రిక ప్రకటనకు శుక్రవారం విడుదల చేశారు. మండలంలోని తూర్పు గానుగూడెం గ్రామంలో రాజానగరం సత్రం యొక్క హక్కు భుక్తమైన సర్వే నెంబర్లు 20,27,28,135లలో బహిరంగ మార్కెట్టు నందు సుమారు రూ.50 కోట్ల విలువ గల మొత్తము య.25.16 సెంట్లు వరి భూమి సుమారుగా గత 80 సంవత్సరముల పైబడి కొంతమంది సాగు చేసుకుంటున్నారని చెప్పారు. వారి వద్ద నుంచి ప్రభుత్వానికి కట్టవలసిన సుమారు రూ.78 లక్షల బకాయి ఉందని చెప్పారు. దీంతో ఆ దేవాదాయ భూమలకు ప్రస్తుతం సాగు చేసుకుంటున్న వారికి ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం

చేశారు. దేవదాయ ధర్మదాయ శాఖ చట్టం 30/87 నందలి సెక్షను 83(2) ప్రకారం ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చమని, వారి వద్ద నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఆ భూములను దేవదాయ ధర్మదాయ శాఖ సంస్థల కార్యనిర్వహణాధికారులు, సిబ్బంది, రాజానగరం పోలీసు సబ్ ఇన్స్పెక్టర్, సిబ్బంది, రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామస్థుల సమక్షంలో ఆ భూమిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆక్రమణలో ఉన్న సదరు మొత్తము య.25.16 సెంట్ల భూమిని తిరిగి దేవదాయ ధర్మదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. త్వరలో సదరు భూమి కౌలు హక్కులకు బహిరంగ వేలం పాట నిర్వహించబడును అని అధికారులు తెలిపారు.

ఘనంగా ఏకాదశి పర్వదినం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని మండలంలో అన్ని దేవాలయాలలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దైవదర్శనం చేసుకున్నారు దేవరపల్లిలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుండి స్వామి వారికి అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, స్థానిక ప్రముఖులు ఉదయం దర్శనం చేసుకున్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో భక్తులు రామాలయం వెంకటేశ్వర స్వామి ఆలయంలో దేవదర్శనం చేసుకున్నారు.

అమలాపురంలో...

విశాలాంధ్ర - అమలాపురం : ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు శుక్రవారం అమలాపురంలోని భూసమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అంగరంగ వైభంగా జరిగాయి. అర్ధరాత్రి 2గంటల నుండి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలి వచ్చి బారులు తీరి ఉత్తర ద్వారం ద్వారా వెంకటేశ్వరుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల తాకిడితో ఆలయం కిటకిటలు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, ఈఓ యర్రా వెంకటేశ్వరరావు అర్ధ రాత్రి నుండి ఆలయంలో వుండి ఉత్సవ ఏర్పాటు భక్తులకు బారికెట్లు, తాగునీటి సరఫరా, ప్రసాద వితరణ, రాజరాజేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన భారీ అన్నదాన సమారాధన కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. ఆలయంలో ముద్రించిన వేంకటేశ్వర స్వామి నూతన క్యాలెండర్‌ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్నతో కలిసి ఆలయ ప్రాంగణంలో భక్తుల గోవింద నామ స్మరణ మధ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమూడా చైర్మన్ అల్లాడి స్వామినాయుడు, నల్లా స్వామి, దున్నాల దుర్గ, నల్లా సుబ్బారావు, కంచిపల్లి అబ్బులు, నల్లా పవన్, బొర్రా వెంకటేశ్వరరావు, మోకా వేంకట సుబ్బారావు, కుంచె వెంకన్న బాబు పాల్గొన్నారు.

ముందస్తు బైండోవర్ కేసులు నమోదు

విశాలాంధ్ర - చాగల్లు : సంక్రాంతి సందర్భంగా చాగల్లు మండలంలోని ప్రజలు జూద క్రీడలకు బదులు సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని ఎస్ ఐ నరేంద్ర కోరారు. ఆయన చాగల్లు మండలం గ్రామ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. చాగల్లు మండలంలో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట, గుండాటలు నిర్వహించిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితేకఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఇప్పటికే 58 మందికి బైండోవర్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

పాడి రైతులకు చేయూతకు గోకులాలు

విశాలాంధ్ర - సీతానగరం: పాడి రైతులకు చేయూత కోసమే గోకులాలు నిర్మాణం అని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ. మండలంలోని రాపాక, చినకొండేపూడి గ్రామ పంచాయితీలలో గోకులాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రైతుల సమక్షంలో శనివారం ప్రారంబించారు. మండల వ్యాప్తంగా 46 గోకులాలు మంజూరు కాగా 38 నిర్మాణ దశలో ఉండగా 23 నిర్మాణం పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతుల భరోసా కనిపిస్తూ ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాడి రైతులకు ఇబ్బందులు లేకుండా రెండు, నాలుగు, ఆరు గోవులను లేదా గేదెలను సంరక్షించే విధంగా గోకులాల నిర్మాణానికి నిధులను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎమ్ భారతి, ఏ పి ఓ నాగ శేష వేణి, పాడి రైతులు ముత్యాలు గోవింద రాజు, కమ్మా యేసు రాజు,చంద్ర ప్రసాద్, ముత్యాలు మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు సుబ్బారావు పాల్గొన్నారు.

సంక్రాంతి ప్రతి కుటుంబంలో వెలుగు నింపాలి

విశాలాంధ్ర -చాగల్లు : సిరులు కురిపించే సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబంలో వెలుగు నింపాలని సెక్టర్ సూపర్వైజర్ పివి పద్మావతి అన్నారు. శుక్రవారం చాగల్లు గ్రామంలోని అంగన్వాడి కేంద్రం నెంబర్ 65 నందు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పిల్లలు హరిదాసుని వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి టీచర్ పి వెంకటలక్ష్మి, విజయ్ కుమారి నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర - గోపాలపురం : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని కనబరిచి మానసిక ఉల్లాసం పెంపొందించుకోవాలని శ్రీ గౌతమి మరియు కొండవీటి డిగ్రీ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె ఎస్ డి ఆశీర్వాదం తెలిపారు. శుక్రవారం స్థానిక కొండవీటి విద్యాసంస్థలలో విద్యార్థులు సిబ్బంది సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని విద్యార్థినీ, విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె ఎస్ డి ఆశీర్వాదం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య ద్వారా ఎందరో ఉన్నత

శిఖరాలు అధిరోహించాలని, క్రీడలు భవిష్యత్తులో స్థిరపడుటకు కారణం అవుతుందన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, ఇంటర్మీడియట్, నర్సింగ్ కాలేజీల ప్రిన్సిపల్స్ వై. ప్రసాద్, కె. సంపత్ కుమార్, సి హెచ్. అనూష, ఆయా విభాగాల అధ్యాపకులు,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్స్‌తో రైతులకు లాభసాటి

విశాలాంధ్ర పెరవలి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ విస్తరణ కొరకు డ్రోన్ సహాయంతో సాంకేతిక మరియు శాస్త్రీయ విధానంలో డ్రోన్ పిచికారి కార్యక్రమం చేపట్టడం జరిగింది. వరి పంటలపై పురుగులు తెగులు నియంత్రణ కొరకు వ్యాప గింజల ఇంగువ కషాయాలను చాప బెల్లం ద్రావణాన్ని డ్రోన్ సహాయంతో పిచికారీ చేయించినట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు తెలిపారు. .జిల్లా వ్యాప్తంగా 6 డ్రోన్స్ ద్వారా ఈకార్యక్రమం చేపట్టి నట్లు తెలిపారు. జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ మాట్లాడుతూ వరి పంటలపై కాండం తొలిచేపురుగు రసం పీల్చే పురుగు మాగుడు మొదలగు తెగుళ్లను నియంత్రించడానికి ప్రకృతి వ్యవసాయ కషాయాలు పిచికారి చేయడం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. యూనిట్ ఇంచార్జ్ మహాలక్ష్మి తెలియజేశారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది షేక్ భేగం గన్నమ్మ రైతులు పాల్గొన్నారు.

సీఆర్పీలకు వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మంగళగిరి విద్యా భవన్ నందు రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్ అబ్రహంని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసిన రాష్ట్ర సీఆర్పీల అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం వేణుగోపాల్ యాదవ్, రామారావులు కలిశారు. గడిచిన 5 సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదని తక్షణమే వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని జేడీని కోరారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన IKF Finance Ltd. వారి సూచనలుమేరకు యావన్మందికి తెలియ జేయునది ఏమనగా, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం రూరల్, పిడింగొయ్యి గ్రామం, వెంకటగిరి-2, కొత్త డోర్.నెం.13-198 కాపురసుతడు జాగు (లేటు) శ్రీరాములు గారి కుమారుడు వీర వెంకట సత్యనారాయణ గారు ది.18-12-2024న స్థిరాస్తి శెటిల్‌మెంట్ దస్తావేజు నెం. 8517/2024,యస్.ఆర్.ఓ. పిడింగొయ్యి ద్వారా వారి తల్లిగారైన జాగు వరలక్ష్మిగారి వద్ద నుండి రిజిష్టర్ పొంది సర్వ హక్కులతో అనుభవించుచున్నారు. సదరు ఆస్తి జాగు వరలక్ష్మి తల్లిగారైన సామన సింహాచలం ఇంటెస్టేటుగా మరణించిన దరిమిలా ఆమె ఏకైక వారసురాలైన జాగు వరలక్ష్మిగారికి సంక్రమించినదని అట్టి ఆస్తిని పై శెటిల్‌మెంట్ దస్తావేజు రీత్యా తన కుమారుడైన జాగు వీర వెంకటసత్యనారాయణకి రిజిష్టర్ చేసిన దరిమిలా ఆయనకు సంక్రమించి ఆయన మాత్రమే సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించుచున్నారని చెప్పుచూ సదరు ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజులైన 1)ది.04-02-1987న రిజిష్టర్ కాబడిన విక్రయ ద.నెం. 943/1987, 2)24-01-2007న రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.694/2007, పోయినవని, దొరకలేదని చెప్పుచూ నాక్లయింటును ఋణం కొరకు సంప్రదించి యున్నందున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై గాని, పోయిన దస్తావేజులపై గాని ఎవరికైనా ఏవిధమైన అక్షేపణలు, కోర్టు జప్తులు, తనఖాలు ఇతర క్లయిములు వగైరాలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 10రోజులలోగా నాకు గాని, నాక్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారములతో తెలియజేయగలరు. గడువులోగా ఎటువంటి క్లయిములు వగైరా రాని యెడల నిష్పేచి ఆస్తిగా భావించి నా క్లయింటు ఋణం మంజూరు చేయుదురని తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు షెడ్యూలు ఆస్థిని గాని, నా క్లయింటు హక్కులను గాని బైండ్‌చేయజాలవు.

షెడ్యూలు: తూర్పు గోదావరిజిల్లా, రాజమహేంద్రవరం రి.డి., ప్రస్తుతం పిడింగొయ్యి సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో చేరిన రాజమహేంద్రవరం రూరల్, పిడింగొయ్యి గ్రామం తాలూకు వెంకటగిరిలో నున్నటువంటి జిరాయితీ మెర్క ఆర్.యస్.నెం.344రు దాఖలా భూమిని దరిమిలా సబ్-డివిజన్ కాబడినట్టి ఆర్.యస్.నెం.344/2రు పూరా య.19-70ట్లు భూమిలో ఈశాన్యం భాగం దర్మిలా సబ్-డివిజన్ కాబడిన ఆర్.యస్.నెం.344/2B2 రు దాఖలా య 3-10ట్లు భూమిని లే-అవుట్ కాబడిన ప్లాను దాఖలా ప్లాట్లులో నెం.11రు ప్లాటు చ.గ.309.1/3లు స్థలములోని పడమరవైపు చ.గ.163.8లు స్థలమున్నూ అందలి పాత డోర్.నెం.13-127 రుకు,ప్రస్తుత డోరు నెం.13-198రు గల గ్రౌండ్ ఫ్లోరు&ఫస్ట్ ఫ్లోరుతో నున్న మేడయిల్లు స్థలం వగైరాలు **హద్దులు:తూర్పు:**యీ ఆస్థి తాలూకు గోడను చేరి శిరపరపు అచ్చుయ్యనాయుడు గారి ఆస్థి గోడ,అ.50లు,**దక్షిణం:**యీ ఆస్థి తాలూకు గోడను చేరి గుబ్బల సుబ్బయమ్మ గారి యింటి స్థలం, అ.29-6లు,**పడమర:**వాసంశెట్టి శ్రీదేవి గారి స్థలం,అ.50లు, **ఉత్తరం:**లే-అవుట్ రోడ్డు,అ.29-6లు.

సాంబేలు ఆంజనేయ ప్రసాద్, అడ్వకేట్
AP LAW FIRM, డోర్.నెం.54-15-13, మధు టవర్స్, ఫ్లాట్ నెం. ఎఫ్.టి.హెచ్.3, భారతీ నగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ ప్రక్కన, విజయవాడ-8. సెల్: 9949533987
విజయవాడ తేది: 10-01-2025

మినీ గోకులం ప్రారంభం

విశాలాంధ్ర - పిఠాపురం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం మండలం కుమారపురంలో మినీ గోకులాన్ని ప్రాంభించారు. శ్రీ కృష్ణుడి ఆలయం వద్ద నిర్మించిన ఈ గోకులాన్ని ప్రారంభించి రైతు యాతం నాగేశ్వరరావుకు అందజేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.1.85 లక్షల వ్యయంతో దీన్ని నిర్మించారు. మినీ గోకులాన్ని ప్రారంభించి నాలుగు గోవులను రైతుకు అందజేశారు. ఇదే వేదిక నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 12,500 మినీ గోకులం షెడ్లను లాంఛనంగా ప్రారంభించారు. అతి తక్కువ సమయంలో భారీ సంఖ్యలో గోకులాల నిర్మాణం పూర్తి చేసి రికార్డు సృష్టించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు అందిస్తున్న సదుపాయాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలిం చారు. పశువులకు అందిస్తున్న దాణా, అందుబాటులో ఉన్న పశుగ్రాసం వంగడాలు, పశు గణాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఈ చిత్ర ప్రదర్శన ద్వారా క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో పిఠాపురం నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు పూర్తి చేసిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన పోస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, పౌరసరఫరాల కార్పోరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం నియోజకవర్గం జనసేన, టీడీపీ, బీజేపీ ఇంఛార్జులు మర్రెడ్డి శ్రీనివాస్, ఎస్వీఎస్ఎన్ వర్మ, కృష్ణంరాజు ఇతర ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాల కలయికే సంక్రాంతి : కలెక్టర్

విశాలాంధ్ర - అమలాపురం : సాంస్కృతి సాంప్రదాయాల కలయికే తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి అని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణం నందు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తుగా సంక్రాంతి సంబరాలను ఉద్యోగులతో అంగరంగ వైభవంగా భోగి మంటలు, రంగవల్లులు ముగ్గులు వేసి టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లా ప్రజానీకానికి జిల్లా కలెక్టర్ ముందస్తుగా సం క్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణాన్ని తెలుగుదనంతో సంక్రాంతి శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఈ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో వెలుగు నింపా లని, ఎల్లప్పుడూ సుఖ, సంతోషాలతో జీవించాలని, ప్రజానీకం అందరూ సుభిక్షంగా, ఆయురా రోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజానీకానికి మరొక మారు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ మన కలెక్టరేట్లో చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్థానిక కలెక్టరేట్లో ప్రాంగణంలో సంక్రాంతి శోభ పండుగ ఏర్పాట్లు బాగున్నాయని, కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీ విశ్వేశ్వరరావును జిల్లా జాయింట్ కలెక్టర్ అభినందించారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ అధికారులకు సిబ్బందికి టగ్ ఆఫ్ వార్ పోటీని వారు ప్రారంభించారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో గెలిచిన వారికి మెమోంటో అందజేశారు. జిల్లా అధికారులకు కలెక్టరేట్ సిబ్బందికి జాయింట్ కలెక్టర్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో, సివిల్ సప్లై డిఎం బాల సరస్వతి, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి డిఎసి మెంబర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ కిషోర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, 6 నెలలు నిండిన ప్రతి ఒక్కరికి ఆధార్ నమోదు చేయించాలని ఎంపిడిఓ ఏవిఎస్ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని మల్లిశాల ఐసీడీఎస్ అంగన్వాడీ కేంద్రంలో జగ్గంపేట ప్రాజెక్ట్ సిడిపిఓ ఎమ్ పూర్ణిమ అధ్యక్షతన శుక్రవారం గర్భవతులకు, బాలింతలకు సమావేశం నిర్వహించారు. ఎంపిడిఓ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆధార్ కేంద్రాలు సచివాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి 4 రోజుల పాటు ఆధార్ కాంప్ ఉంటుందని, పోస్ట్ ఆఫీస్‌లో కూడా ఆధార్ నమోదుకు కిట్స్ ఉన్నాయని ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా అంగన్వాడీ టీచర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇప్పుడు డెలివరీలు ఆసుపత్రి లోనే అవుతు న్నాయి కనుక పుట్టిన తేదీ సర్టిఫికెట్ కొరకు హాస్పిటల్‌లో అప్లై చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం వద్ద పండించిన పోషక ఆకుకూరలైన తోటకూర, గోంగూర, పాలకూరలను గ్రామ సర్పంచ్ సర్వసిద్ధి నూకరత్నం, సీడీపీఓ, ఈఓపిఆర్డీ సూర్య భాస్కరరావు చేతులమీదుగా గర్భవతులు, బాలింతలకు పంపిణీ చేశారు.. సూపర్ వైజర్ స్ అమ్మాజీ, సెక్రెటరీ, మహిళా పోలీస్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలో ప్రతి గ్రామంలోనూ త్రాగునీటి సమస్యలు లేకుండా చెయ్యాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆలమూరు మండలంలోని బడుగువానిలంక గ్రామంలో రూ.39.60 లక్షలతో నిర్మిస్తున్న 60 వేల లీటర్ల సామర్థ్యం గల ఓఎచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంక్ పనులకు వారు భూమి పూజ చేసి ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ హామీలలో భాగమైన ఇంటింటికీ తాగునీరు అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోకులం షెడ్డులను ప్రారంభించారు. పాడి రైతులకు అండగా నిలిచేందుకు ఈ గోకులం పథకం ఉపయోగపడుతుం దన్నారు. గ్రామంలో మూడు గోకులం షెడ్డులను ప్రారంభించామని, మండలంలో 49 గోకులాలు మంజూరు చేశామని, అందులో 22 పూర్తి చేసామన్నారు. మిగిలిన షెడ్యూలను నెలాఖరులోగా పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహిస్తున్న యువజనోత్సవాలు రెండవ రోజు మరింత జోష్‌గా సాగాయి. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు నృత్యాలతో చలికి సైతం చెమటలు పట్టేలా విద్యార్థులు ఉర్రూతలు ఊగించాయి. విదేశీ విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఫ్యాషన్ షోలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో ఎంతో చూడ ముచ్చటగా వుందన్నారు. విద్యార్థినీల సంప్రదాయ నృత్యాలు మనసును కట్టిపడేశాయి. నవ్వులు పూయించిన స్కిట్‌లు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. మహిళలు, పురుషుల విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో పురుషుల విభాగంలో కెఎల్ యూనివర్సిటీ మహిళల విభాగంలో ఆదిత్య యూనివర్సిటీ ప్రథమ స్థానంలో నిలిచాయి. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, త్రోబాల్ విభాగంలో పోటీలు హోరా హోరీగా సాగాయి. వివిధ విభాగాలలో గెలుపొందిన విజేతలకు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా ఏ రమేష్, వివిధ విభాగాల డీన్స్ బహుమతులు అందజేశారు.

వివేకానందలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలను కరెస్పాండెంట్ ఒమ్మి రఘురామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు పలు సంప్రదాయ దుస్తులు ధరించి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు ముగ్గులు పెట్టడంతో వారికి బహుమతులు అందజేశారు. భోగి మంట వేసి, రంగు రంగు గాలి పటాలు ఎగురవేసారు. రఘురామ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశేషాలు తెలియజేసి, భారత దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరు గౌరవించి ఆచరించాలన్నారు. విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'శ్రీ భారతి విద్యా సంస్థలు'లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని రాచపల్లి, ఓమ్మంగి గ్రామాల్లో శ్రీ భారతి విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు. ఆ విద్యా సంస్థల అధినేత సుంకర వీరబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల అధినేత వీరబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశేషాలు తెలియజేసి భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ప్రతి ఒక్కరు గౌరవించి ఆచరించాలన్నారు. విద్యార్థులందరూ ఆనందోత్సాహాలతో సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. విద్యాసంస్థల ఆవరణలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు, గాలిపటాల ప్రదర్శన, బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఎంతగానో అలరించాయి. ఎస్ఎస్ఎస్ఎన్ జూనియర్ కాలేజ్ అధినేత ఎస్‌జి రామారావు, ప్రిన్సిపాల్ ఆర్ బుల్లి రామన్న, ఏవోలు పి మూర్తి, సిహెచ్ రాము, ఎస్ సత్యనారాయణ, ఎస్ గంగ బాబు, ఆర్ నాగ చిన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

- ఇళ్లులేని పేదలకు రెండు సెంట్లు స్థలం ఇవ్వాలి
- సీపీఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేద ప్రజలను మోసం చేసిందని సీపీఐ నాయకులు విమర్శించారు. రాజమహేంద్రవరం నగరంలోని ఇళ్లులేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఇళ్ళులేని పేదలు, సీపీఐ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు. సీపీఐ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యంలో శు క్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చారు. అనంతరం ఇళ్లులేని నిరు పేదల నుంచి స్వీకరించిన ఇళ్ల ధరఖాస్తులను అధికారులకు అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కూటమి నేతలు చంద్ర బాబు, పురంధేశ్వరి, పవన్ కళ్యాణ్ , నారా లోకేష్‌లు అనేక వాగ్దానాలు ఇచ్చారన్నారు. ప్రజల ఓట్లు కోసం ఎన్నికల గారడి నిర్వహించారని, ప్రజలను మభ్య పెట్టారని పేర్కొన్నారు. ప్రతి పక్షంలో ఉండగా అధికార దాహంతో ప్రజలను నమ్మించేందుకు అనేక వాగ్దానాలు ఇచ్చి ఇపుడు వాటిన అమలు చేయడంలేదన్నారు. ప్రధానంగా అనేక మంది కనీసం తల దాచుకోవడానికి నీడలేదన్నారు. వారికి గూడు కల్పించాల్సిన భాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంద న్నారు. ఎన్నిలక సమయంలో కూటిమి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మధు డిమాండ్ చేశారు. కూమిటమి ఇచ్చిన హామిలలో ప్రధానంగా ఇళ్ళులేని నిరు పేదలకు రెండు సెంట్ల ఇళ్ళ స్థలాలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామిని ఆయన గుర్తు చేసారు.ఎన్నికల ముందు ఒక మాట అధికారంలోకి వచ్చిన తరువాత మరో మాట ఇచ్చి పేద ప్రజలను మోసం చేస్తే సహించేది లేదని, ప్రజల పక్షాన్న సిపిఐ పోరాడుతుందని హెచ్చరించారు. ప్రజలకు కూడు, గూడు కల్పించడమే సీపీఐ ప్రధాన ఎజెండా అని అన్నారు. ఇళ్ళులేని పేదలకు రెండు సెంట్ల స్థలం కేటాయిండంతో ఆటు ఐదు లక్షలు ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేసారు. గత ప్రభుత్వ హాయాంలో మాజీ ఎంపి భరత్ రామ్ ఇళ్ళ స్థలాలకు పట్టాలు ఇచ్చారని, అయితే లబ్ధిదారులకు స్థలాలు చూపిం చలేదని గుర్తు చేసారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎం.ఎల్.ఏలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలు ఆ లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి న్యాయం చెయ్యాలని డిమాండ్ చేసారు. లేదంటే ఫిబ్రవరి నుంచి దశల వారి ఉద్యమం చేపటుతుం దని మధు హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, నగర కార్యవర్గ సభ్యులు సింగం నౌరుజీ, చింతలపూడి సునీల్, మహిళా సమాఖ్య కార్యదర్శి పి.లావణ్య , ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు త్రిమూ ర్తులు, ప్రజా నాట్య మండలి అధ్యక్షులు ముప్పన కుమార్ పాల్గొన్నారు.

రైల్వే లైన్ నిర్మాణ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - అమలాపురం : కోటిపల్లి నర్సాపురం రైల్వే లైన్‌లో భాగంగా భూ సేకరణ పూర్తయిన ప్రాంతాలలో రైల్వే లైన్ నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ రైల్వే అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమలాపురం కలెక్టరేట్లో కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్‌కు సంబం ధించి రైల్వే లైన్ నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ రెవెన్యూ రైల్వే అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో రైల్వే లైన్లో భాగంగా భూ సేకరణ పూర్తయిన ప్రాంతాలలోని భూమిని రైల్వే అధికారులు స్వాధీన పరుచుకొని రైల్వే నిర్మాణ పనులను ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాలలో భూ సేకరణ పూర్తయిన భూము లను సర్వే చేసి హద్దులను గుర్తించి రైల్వే అధికారులకు అప్పగిం చాలన్నారు. సంబం ధిత ప్రాంతాలలోని రైతులు తదుపరి పంట వేసేలోపు రైల్వే అధికారులు భూ సేకరణ పూర్తయిన భూములను తమ ఆధీనంలోకి తీసుకొని నిర్మాణ పనులు ప్రారంభించాల న్నారు. కోనసీమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే లైన్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులం దరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ టి నిషాంతి, దక్షిణ మధ్య రైల్వే, ఉప ముఖ్య ఇంజనీరు, ఏ బద్దియ్య, అమలా పురం, కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు కే మాధవి, శ్రీకర్, గ్రామీణ నీటి సరఫరా కారునిర్వాహక ఇంజనీరు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

సీపీఐ, బికెఎంయూ డిమాండ్

విశాలాంధ్ర - రాజోలు : ఎన్డీఏ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గృహనిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని తదితర డిమాండ్లతో సఖినేటిపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం (BKMU) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఇళ్ల స్థలాల కొరకు దరఖాస్తులను, వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, కౌలు రైతుసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లి బుజ్జిబాబు, సఖినేటిపల్లి సీపీఐ మండలకార్యదర్శి గెడ్డం ప్రభాకరరావు, సీపీఐ నాయకులు దీపాటి. గంగాచలం, దొండపాటి చంద్రమోహన్, ఎడ్ల విజయారత్నం, పుల్లెల ఆనంద్, దొండపాటి నరసింహారావు, నల్లి టోనీ బాబు, బుగ్గి. రవికుమార్, చొప్పల. బెన్ని, నల్లి. చిట్టిబాబు, చొప్పల శ్రీను, తాడి. సామ్యూల్, దొండపాటి నర్మదాసింగ్, దీపాటి చింటూ తదితరులు నాయకత్వం వహించారు.

గోడలపై పోస్టర్లు అతికిస్తే క్రిమినల్ చర్యలు : కమిషనర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : నగరాన్ని సుందరీకరించడానికి అన్ని చర్యలు తీసుకోవడం జరిగిం దని నగరపాలక సంస్థ కమిషనర్ ఏ.భాను ప్రతాప్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు చెప్పారు. ఇందులో భాగంగా ఏలూరు నగరాన్ని రంగులతో అలంకరిస్తున్నా మని అయితే వివిధ సంఘాలు, ఇతరులు మున్సిపల్ గోడలపై వాల్ పోస్టర్లు అతికించి సుందరీకరణను పాడు చేస్తున్నారని అటువంటి వారిపై నాన్ బెయిల్‌బుల్ సెక్షన్లలో కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా నగరానికి విచ్చేస్తున్న అతిధులను ఆహ్వానిస్తూ ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరం అంతా పరిశుభ్రత-సుందరీకరణ చర్యలు చేపట్టామన్నారు. సుందరీకరణ పనులలో మేము సైతం అంటూ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ ఎం ఆర్ పెదబాబు,కమిషనర్ ఏ.భాను ప్రతాప్, పలువురు కార్పొరేటర్లో మున్సిపల్ అధికారులు స్వయంగా డివైడర్లకు రంగులు వేశారు. ఈ సందర్భంగా కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఏ.భాను ప్రతాప్ మాట్లాడుతూ ప్రజాధనం లక్షలాది రూపాయలు వెచ్చించి నగరంలో డివైడర్లు, గోడలు రంగులు వేసి ప్రజలను ఆకట్టుకునే విధంగా వివిధ రకాల చిత్రాలను వేసి సుందరికరణ చేస్తుంటే తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వివిధ సంఘాలు విద్యాసంస్థలు, వివిధ పార్టీలకు సంబంధించిన వారు అర్ధరాత్రి సమయాల్లో రంగులు వేసిన గోడలపై పోస్టర్స్ అతికించి సుందరీకరించిన నగరాన్ని అసహ్యంగా తయారు చేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ తరపున రాత్రిపూట నిఘా ఏర్పాటు చేసి పోస్టర్స్ అతికించిన వారిని పట్టుకుని వారిపై నాన్ బెయిల్ బుల్ సెక్షన్ కింద పోలీసు కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పెదబాబు, కమిషనర్ ఏ.భాను ప్రతాప్ స్పష్టం చేశారు.

కన్నుల పండువగా స్వామివారి ఉత్తర ద్వారదర్శనం

విశాలాంధ్ర - ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్తరద్వార దర్శనం శుక్రవారం ఉదయం కన్నులపండువగా జరిగింది. ఉత్తరద్వారం ద్వారా శ్రీనివాసుడ్ని దర్శించు కున్న భక్తులు భక్తితన్మయత్వంపొందారు. ఆలయ పరిసరాలన్నీ గోవిందనామస్మరణలతో మారు మ్రోగాయి. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుడ్ని వెండిశేషవాహనంపై ఉంచి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఉదయం 4గంటలకు ఆలయ వంశపారం పర్యధర్మకర్తలి మండలి సభ్యులు సూరానేని నివృత రావు, ఆలయ ఏఈవో బాబూరావు, ఈఈ భాస్కరరావు, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు, టీడీపీ నాయకులు మొగతడకల శ్రీనివాసరావు, తూంపాటి పద్మవరప్రసాద్, పోలిన శ్రీనివాసరావు పాల్గొని మొదటిపూజచేసి హారతి ఇచ్చారు. అనంతరం ఉత్తరద్వారాన్ని తెరిచి భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. గ్రామస్తులకు, గోవిందస్వాములకు దక్షణగోపురం ద్వారా దర్శనానికి అనుమతించారు. 500రూ టికెట్లు తీసుకుని దర్శనానికి వచ్చిన భక్తులను అంతరాలయ దర్శనానికి అనుమతించకపోవడంతో నిరుత్సాహం వ్యక్తంచేశారు. అనంతరం స్వామిని దర్శించుకుని మాలవిరమణలు చేశారు. మద్యాహ్న సమయంలో రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి దర్శించుకున్నారు. తెల్లవారకముందే భక్తులు ఆలయానికి చేరుకోవడంతో ప్రారంభంలోనే సుమారు 10వేలమంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. స్వామివారిని,అమ్మవార్లను వెండిశేషవాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీవారి నిత్యాన్నదానంలో సుమారు 15వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా భీమడోలు సిఐ యుజె.విల్సన్, స్థానిక ఎస్సై టి.సతీష్, ఎస్సై భగవాన్ తదితరులు బందోబస్తు నిర్వహించారు.

నర్సరీలకు విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలి

విశాలాంధ్ర - కడియం : దేశంలోనే పర్యావరణాన్ని ఆరోగ్యాన్ని ప్రజలకు పంచి, ఆక్సిజన్ అందిస్తున్న కడియం నర్సరీరంగం నేడు దీనావస్థకు చేరుకుందని కడియం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాళ్ల వీరభద్రరావు అన్నారు. మరీ ముఖ్యంగా కూలీల జీతాలు, రవాణా మెయింటినెన్స్ భరించలేనంతగా పెరిగిపోయాయి అన్నారు. కడియం నర్సరీరంగాన్ని ఆదుకోవాలంటే పూర్తిస్థాయిలో విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కరెంటు సంవత్సరానికి 365 రోజులు 24 గంటలు ఎటువంటి కోతలు లేకుండా అందించాలని కోరారు.

పాడిరైతులకు అండగా కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ, పిఠాపురం : 'గత ప్రభుత్వం పాడి రైతును పట్టించుకున్న పాపాన పోలేదు. రాష్ట్రంలో ఎవరూ బాగుపడకూడదు..ఎవరి దగ్గరా డబ్బులుం డకూడదు అనే ఒకే ఒక సిద్ధాంతంతో లక్షలాది పాడిరైతుల పొట్టకొట్టే చర్యలు ఆనాటి పాలకులు చేపట్టారు. సహకార డెయిరీలను గాలి కొదిలేసి, సొంత డెయిరీలను అభివృద్ధి చేసుకోవడంపైన దృష్టి పెట్టార'ని ఉప ముఖ్యమంత్రివ పవన్ కళ్యాణ్ చెప్పారు. పాడి రైతులకు ఎంతో అవసరం అయ్యే గోకులాలను గత అయిదేళ్ల పాలనలో కేవలం 268 నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం కేవలం 6 నెలల్లోనే 12,500 నిర్మించి పాడి రైతులకు అండగా నిలిచిందని, ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. రాజకీయం అంటే ఓట్ల కోసం బుగ్గలు నిమరడం, ముద్దులు పెట్టడం కాదు...కష్టంలో ఉన్నవారికి అండగా నిలబడటం, వారికి వృద్ధిలో తోడ్పాటు నందించడమే నిజమైన రాజకీ యం అన్నారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యా ప్తంగా 12,500 గోకులాలను ఒకే రోజు ప్రారంభించే కార్యక్రమాన్ని శుక్రవారం పవన్ కళ్యాణ్ పిఠాపురం వేదికగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఠాపురం పాతబస్టాండు వద్ద ఉన్న మున్సి పల్ పాఠశాలలో జరిగిన సభలో పవన్ మాట్లాడుతూ..."నాకు స్పష్టంగా రాజకీయాలు చేయడమే తెలుసు. మండల పరిషత్ అధికారి మీద దాడి జరిగితే ఆయనది ఏ కులం..ఏ ప్రాంతం అని చూడకుండానే పరామర్శకు వెళ్లాను. ఓ ప్రభుత్వ అధికారి కొడుకుగా ఈ రాష్ట్ర ప్రజలు పన్నులు కట్టిన జీతం సొమ్మును తిని పెరిగిన వ్యక్తిగా ఏ ప్రభుత్వ అధికారిపై, సిబ్బందిపై దాడి జరిగినా ఇలాగే స్పందించేవాడిని. ప్రభుత్వ అధికారుల మీద దాడి జరిగితే మా నాన్న మీద జరిగిన దాడిగానే దాన్ని భావిస్తాను.అరాచక పాలన నుంచి విముక్తి అయిన రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకెళ్లేం దుకు నిబద్ధతతో పని చేయాలనే తలంపుతోనే ముందుకు వెళ్తున్నాం. స్వాతం త్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా సరైన రోడ్లు లేక, డోలీల్లో వైద్యసేవలకు తీసుకెళ్తూ నరకయాతన పడుతున్న గిరిజనుల కష్టాలను స్వయంగా తెలుసుకు నేందుకే కొండల్లో తిరిగానన్నారు. తుపాకీ విడిచిన ఓ విప్లవకారుడు ఓటును నమ్మి జనంలోకి వస్తే ఎలా పాలిస్తాడో అదే విధంగా నేను ముందుకు వెళ్తాను" అన్నారు.